రైతు సంబర సభలో రైతులేరీ..?

- కూటమి నాయకుల్లో అంతర్మథనం
- ఫ్లెక్సీపై కానరాని మంత్రుల ఫొటోలు


అంబాజీపేటలో జరిగిన రైతు సంబర సభలో రైతులు లేక ఖాళీగా దర్శనమిచ్చిన కుర్చీలు

అంబాజీపేట: అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు అండగా నిలుస్తున్నామని చెప్పుకుంటూ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి రైతు సంబర సభ లబ్ధి పొందిన రైతులు లేక వెలవెలబోయింది. అంబాజీపేట మార్కెట్ యార్డులో చైర్మన్ చిట్టూరి శ్రీనివాస్ అధ్యక్షతన పి.గన్నవరం నియోజకవర్గ స్థాయి రైతు సంబర సభ మంగళవారం జరిగింది. పేరుకు మాత్రమే రైతు సంబర సభ ఏర్పాటు చేశారు కానీ అన్నదాత సుఖీభవ పథకం ద్వారా లబ్ధి పొందిన అసలు రైతులు సభలో ఎక్కడా కానరాలేదు. ఇదే విషయాన్ని కొంత మంది కూటమి నాయకులు, నియోజకవర్గ పరిశీలకుడు ఎస్కే సుభాన్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ఆయన స్పందిస్తూ కొంత మంది కార్యకర్తలకు రైతులను తీసుకురావాలని చెప్పామన్నారు. వ్యవసాయం పనులు ఉండటంతో రైతులు హాజరు కాలేదని పొంతనలేని సమాధానం చెప్పుకురావడంతో సభికులు, నాయకులు అవాక్కయ్యారు. ఇదే విషయంపై జనసేన పార్టీ నాయకులు కూడా సుభాన్‌ను ప్రశ్నించగా కప్పదాటు సమాధానం చెప్పారు. ఈ సభకు కూటమి నాయకులు, కార్యకర్తలు అంతంతమాత్రంగా రావడంతో ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తూ సభ వెలవెలపోయింది. కాగా పి.గన్నవరం మూడు రోడ్ల జంక్షన్ నుంచి అంబాజీపేట మార్కెట్ యార్డు వరకు నిర్వహించిన ట్రాక్టర్ ర్యాలీలో పాల్గొన్న వివిధ ట్రాక్టర్ డ్రైవర్లు కూడా సభలో ఉన్నారు. రైతు సంబర సభ ఏర్పాటు చేసి ఏవేవో చెబుతున్నారే గాని రైతు సంక్షేమ కోసం చేసిన పనులు చెప్పుకోలేకపోతున్నామని, తమకు అవకాశం ఇవ్వడం లేదని ఆవేదనతో కేఎస్ఎస్ అధికార ప్రతినిధి పత్తి దత్తుడు ఎమ్మెల్యేకు వివరించారు. చేసిన పనులను సభలో చెప్పకుండా వేరే అంశాలపై ప్రసంగించడం దారుణమని, ఇతరులకు అవకాశం కల్పించకుండా ఉండటంపై ఎమ్మెల్యే ఎదుట ఆవేదన చెందారు.

బయటపడిన విభేదాలు

రైతు సంబర సభకు గ్రామాల నుంచి లబ్ధి పొందిన రైతులను సభకు తీసుకురావవాల్సిందిగా కూటమిలో భాగమైన టీడీపీ, జనసేన నాయకులకు పార్టీ కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయి. రైతులకు సమాచారం ఇవ్వడంలో మీరు చెప్పారా అంటూ టీడీపీ, జనసేన నాయకులు ఒకరిపై ఒకరు దాటవేత ధోరణి అవలంబించడంతో వెరసి రైతు సంబర సభ పూర్తిగా వెలవలపోవడంతో పార్టీలోని అంతర్గత విభేదాలు బయటపడ్డాయి.

ఫొటోలు లేవని అసహనం

అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన రైతు సంబర సభ ఫ్లెక్సీలో సంబంధిత వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఫొటోలు ఫ్లెక్సీపై లేకపోవడంతో స్టేజీపై ఉన్న నాయకులతో పాటు సభకు హాజరైన కార్యకర్తలు సైతం గుసగుసలాడుకున్నారు. ఈ విషయంపై స్థానిక నాయకులు మంత్రుల ఫొటోల గురించి నాయకులను అడగ్గా ఈ ఫ్లెక్సీ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిందని ఇందులో జోక్యం లేదని సర్దిచెప్పుకున్నారు. అయినప్పటికి టీడీపీ వర్గీయులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

పోగొట్టుకున్న 39 మొబైళ్ల గుర్తింపు

ఆలమూరు: మండలంలో మూడు నెలల నుంచి వివిధ కారణాల రీత్యా పోగొట్టుకున్న లేదా చోరీకి గురయిన 39 మొబైళ్లను గుర్తించామని ఆలమూరు ఎస్సై జి.నరేష్ అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో పోలీసులు రికవరీ చేసిన ఏడు మొబైళ్లను బాధితులకు మంగళవారం అందజేశారు. ఎస్సై నరేష్ మాట్లాడుతూ మొబైల్స్ పోగొట్టుకున్న వారు ఆందోళన చెందవద్దన్నారు. మొబైల్స్ పోయిన వారి కోసం ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ఆ యాప్‌లో పోగొట్టుకున్న సెల్‌ఫోన్ వివరాలు నమోదు చేస్తే సత్వరమే సమీప పోలీసు స్టేషన్ విచారణ చేపడుతుందన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

రాజోలు: స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలోని సమస్యల పరిష్కారానికి సూచనలు, సలహాలను స్వీకరించేందుకు ఈ నెల 13న డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ పి.ధనమ్మ మంగళవారం తెలిపారు. 99592 25538 నంబర్‌కు ఫోన్ చేసి ప్రయాణికుల సలహాలు, సూచనలు చెప్పవచ్చన్నారు.

ఖోఖో పోటీలకు 11 మంది ఎంపిక


జిల్లా ఖోఖో జట్టుకు ఎంపికైన తొండవరం విద్యార్థులు

అంబాజీపేట: జిల్లా ఖోఖో జట్టుకు తొండవరం జెడ్పీ హైస్కూల్ నుంచి 11 మంది విద్యార్థులు ఎంపికైనట్టు హెచ్ఎం పీవీ కేశవాచార్యులు, పీడీ పి.సూర్యనారాయణ తెలిపారు. స్థానిక హైస్కూల్‌లో క్రీడాకారులను మంగళవారం అభినందించారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 11న అమలాపురం బాలయోగి స్టేడియంలో ఖోఖో పోటీలను నిర్వహించారన్నారు. ఈ నెల 21న కాకినాడలో జరిగే జోనల్ పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారన్నారు. ఎంపికైన క్రీడాకారులను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా 'కొడవటి'

మలికిపురం: లక్కవరం గ్రామంలో గుర్రం జాషువా ఎన్నికల పరిశీలకుడిగా లక్కవరం నూతన వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీని స్థానిక నేతలు ఎన్నుకున్నారు. లక్కవరం నూతన గ్రామ శాఖ అధ్యక్షుడిగా కొడవటి దొరబాబు, ప్రధాన కార్యదర్శిగా ఇంజేటిరాజు, కార్యదర్శులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

64 మందికి ఉచిత కంటి పరీక్షలు

పి.గన్నవరం: ముంగండలోని మంత్రవాది ఇందిరాకుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 64 మందికి కంటి పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వీరిలో 20 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేసేందుకు నిర్ధారించి, వేమగిరి పరమహంస యోగానంద కంటి ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమానికి హోమియో వైద్యుడు ఖండవిల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యం వహించారు. పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి సిబ్బంది సేవలు అందించారు.

జొన్నాడ విద్యార్థుల ప్రతిభ

ఆలమూరు: మండలంలోని జొన్నాడకు చెందిన విద్యార్థులకు జాతీయ స్థాయి కుంగ్‌ఫూ, కరాటే పోటీల్లో చక్కని ప్రతిభను కనబరచి అవార్డులు సాధించారు. ఇటీవల తెలంగాణలోని జనగాంలో న్యూ స్టార్ చైనీస్ కుంగ్‌ఫూ అకాడమీ నిర్వహించిన నాలుగో జాతీయ స్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీల్లో పాల్గొన్నారు. కటాస్ బ్లూ బెల్ట్ విభాగంలో కె.జైసాయి చరణ్ (గోల్డ్ మెడల్), స్ప్రెరింగ్ ఎల్లో బెల్ట్ విభాగంలో వి.హేమలత (గోల్డ్ మెడల్), వి.పావని (గోల్డ్ మెడల్), ఆరెంజ్ బెల్ట్ విభాగంలో టి.జైపాల్ (గోల్డ్ మెడల్), జి.శంకర్ (గోల్డ్ మెడల్), బి.అఖిల్ (గోల్డ్ మెడల్) సాధించినట్లు మాస్టర్ కె.సత్తిబాబు తెలిపారు. అలాగే బ్లాక్ బెల్ట్ జూనియర్ విభాగంలో గ్రాండ్ చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నారు. అవార్డులు సాధించిన విద్యార్థులను పలువురు అభినందించారు.

సంకష్టహర చతుర్థి పూజలు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వర స్వామి సన్నిధిలో మంగళవారం సంకష్టహర చతుర్థి సందర్భంగా ఆలయ వేదపండితులు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయక రావు ఆధ్వర్యంలో స్వామికి పంచామృతాభిషేకం, గరిక పూజ, లక్ష్మీగణపతి హోమం వంటి విశేష పూజలు జరిపారు. స్వామిని దర్శించడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అర్చకులు అలంకరించారు. స్వామిని మాడవీధుల్లో ఊరేగించారు.

ఉచిత బస్సు పథకంపై ఆటోడ్రైవర్ల నిరసన


తాటిపాకలో ఆందోళన చేస్తున్న ఆటోడ్రైవర్లు

రాజోలు: ప్రభుత్వం ప్రారంభించనున్న ఉచిత బస్సు పథకాన్ని నిరసిస్తూ రాజోలు తాలూకా ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం తాటిపాక సెంటర్‌లో ఆటో డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. తమ వద్ద ఉన్న డీజిల్ ఆటోలను ప్రభుత్వం తీసుకుని సబ్సిడీపై బ్యాటరీ ఆటోలను డ్రైవర్లకు అందజేయాలన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా ఆటో డ్రైవర్లందరికీ పింఛన్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లతో పాటు కుటుంబ సభ్యులకు కూడా ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని నినాదాలు చేశారు. రాజోలు తాలూకా ఆటో కార్మికుల ఐక్యత వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు కడలి రామకృష్ణ మాట్లాడుతూ ఉచిత బస్సు పథకం కారణంగా ఆటో డ్రైవర్లు నష్టపోతారన్నారు. ఆటో డ్రైవర్లను ఆదుకుంటామని కూటమి మంత్రులు ఆటో డ్రైవర్లకు రూ.10 వేలు ఇస్తామని, రూ.15 వేలు ఇస్తామని తలో విధంగా ప్రకటనలు చేస్తున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆటో డ్రైవర్ల యూనియన్లతో చర్చలు జరపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించినా జిల్లాలోని మంత్రి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఎవరూ కనీసం ఆటో డ్రైవర్లను సమావేశపరచి సమీక్ష నిర్వహించలేదని ఆరోపించారు. ఈ నెల 15 నుంచి ఉచిత బస్సు పథకం ప్రారంభిస్తే ఆటో డ్రైవర్లు, వారి కుటుంబాల పరిస్థితి ఏంటనేది ప్రశ్నార్థకంగా మారిందన్నారు. డిగ్రీలు చదివిన వారు కూడా ఆటో నడిపి కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. ఆందోళనలో అధిక సంఖ్యలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

చేతనైతే అభివృద్ధిపై దృష్టి పెట్టండి

ఎమ్మెల్యే గిడ్డిపై గన్నవరపు ఆగ్రహం

పి.గన్నవరం: డీసీఎం పవన్ కళ్యాణ్‌ను ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అవమాన పరిచారంటూ ఇటీవల పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఇజ్రాయిల్‌ను ఫోన్‌లో బెదిరించడాన్ని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. సాటి చట్టసభ సభ్యుడు అని గౌరవం లేకుండా ఫోన్‌లో బెదిరించి, అనంతరం ఆ వీడియోలతో ప్రచారం చేసుకోవడం ఎంతవరకూ సమంజసమని గన్నవరపు ప్రశ్నించారు. పోతవరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో గన్నవరపు మాట్లాడారు. బెదిరింపులకు ఎవరూ భయపడేది లేదన్నారు. నియోజకవర్గంలో చాలా సమస్యలు ఉన్నాయని, వాటిపై దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా పి.గన్నవరం నియోజకవర్గంలో అక్రమంగా పెద్ద ఎత్తున మట్టి తవ్వకాలు జరిపి రూ.కోట్లు దోచుకుంటున్నారని గన్నవరపు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దోపిడీ ఎవరు చేస్తున్నారో నియోజకవర్గ ప్రజలు గమనిస్తున్నారని ఆయన అన్నారు. పవన్‌కల్యాణ్‌కు ప్రధాని మోదీ దగ్గర మంచి పేరుందని, ఆయన దయాదాక్షిణ్యాలతోనే రాష్ట్రానికి నిధులు వస్తున్నాయని ఇటీవల ఎమ్మెల్యే గిడ్డి చెప్పారని గుర్తు చేశారు. కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చి లంక గ్రామాల్లో నదీకోత నివారణకు గ్రోయిన్లు, రివిట్‌మెంట్లు నిర్మించాలని సూచించారు. ఊడిమూడిలంక వద్ద వశిష్ట నదీపాయపై రూ.50 కోట్లతో వంతెన పనులు జగన్ హయాంలో ప్రారంభమయ్యాయన్నారు. నేటికీ కూటమి ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు బిల్లులు ఇవ్వడం లేదన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో 2019 నుంచి 2024 వరకూ నియోజకవర్గంలో రూ.వందల కోట్లతో రోడ్లు, ప్రభుత్వ భవనాలు, వంతెనలు వంటివి ఎన్నో నిర్మాణాలు జరిగాయని, తాము ఆధారాలతో వచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. జగన్ పాలనపై అవగాహన తెచ్చుకుని మాట్లాడాలన్నారు. ముక్తేశ్వరం నుంచి జగన్నాథపురం వరకూ పాడైన రోడ్డును కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలలోనే ఆధునీకరిస్తామని గిడ్డి ఎన్నికల ముందు హామీ ఇచ్చారని, ఏడాదిన్నర కావస్తున్నా ఆ రోడ్డును ఆధునీకరించారా అన్ని గన్నవరపు ప్రశ్నించారు. సమావేశంలో మండల శాఖల అధ్యక్షులు యన్నాబత్తుల ఆనంద్, విత్తనాల ఇంద్రశేఖర్, మేడిశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర నాయకుడు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, సర్పంచ్‌లు వడలి కొండయ్య, కొంబత్తుల ఏసుబాబు, ఎంపీటీసీలు కొల్లే సూర్యనారాయణ, పులపర్తి రాజారావు, నాయకులు పాల్గొన్నారు.


పోతవరంలో విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు

నట్టేట ముంచిన చంద్రబాబు

- మాజీ మంత్రి గొల్లపల్లి
- పలు గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ


గుడిమెళ్లంకలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు


చింతలూరులో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పార్టీ నేతలు


ఖండ్రిగలో క్యూఆర్ కోడ్లను ప్రదర్శిస్తున్న డేవిడ్‌రాజు, గంగాధరరావు తదితరులు

మలికిపురం: ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రజలను నట్టేట ముంచారని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మండలంలోని గుడిమెళ్లంకలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీలో భాగంగా మంగళవారం ఇంటింటికీ వంచన కార్యక్రమం జరిగింది. గొల్లపల్లితో పాటు పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు మట్టపర్తి నాగేంద్ర పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు కిరణ్ బల్ల అధ్యక్షతన పెనుమత్స రంగరాజు గౌరవ అధ్యక్షుడిగా బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం జరిగింది. వైఎస్సార్ సీపీ నాయకులు స్థానిక నేతల ఆధ్వర్యంలో పార్టీ పతాకం ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికీ వంచన ప్రచారం జరిగింది. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు బల్ల ప్రసన్న కుమారి, మండల పార్టీ అధ్యక్షులు బ్రహ్మాజీ, ఎంపీటీసీలు నల్లి అంజలీదేవి, రాపాక దీవెన, కొణిదల అన్నవరం, మండపేట నియోజకవర్గం పరిశీలకుడు ఆదిత్య కటకంశెట్టి, తెన్నేటి కిషోర్, సహదేవ్ తాడి, రుద్రరాజు చినరాజా తదితరులు పాల్గొన్నారు. మేడిచర్లపాలెంలో జరిగిన ఇంటింటికీ వంచన కార్యక్రమంలో గొల్లపల్లితో పాటు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

రాజోలులో..

రాజోలు: సీఎం చంద్రబాబు పాలనలో సంక్షేమానికి మంగళం పాడుతున్నారని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మంగళవారం మండలంలోని కాట్రేనిపాడు, మెరకపాలెం, కడలి, వేగివారిపాలెం గ్రామాల్లో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో గొల్లపల్లి పార్టీ పతాకాలను ఆవిష్కరించారు. కాట్రేనిపాడు, మెరకపాలెం, కడలి, వేగివారిపాలెం గ్రామశాఖ అధ్యక్షులు కాటాడి ఉమామహేశ్వరరావు, రాజేష్, వాసంశెట్టి బుల్లియ్య, బళ్ల లక్ష్మణరావుల ఆధ్వర్యాన గొల్లపల్లి పార్టీ పతాకాలను ఆవిష్కరించారు. ఇంటింటా తిరిగి చంద్రబాబు ఇచ్చిన హామీల మోసాలను వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు మట్టా శైలజ, సూర్యబలిజ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కోటిపల్లి ఎస్తేరు రాణి, మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొల్లాబత్తుల సతీష్‌బాబు, విద్యార్థి విభాగం అధికార ప్రతినిధి తాడి సహదేవ్, వలంటీర్ విభాగం అధ్యక్షుడు ఉచ్చుల దాసు, గుబ్బల మనోహర్, పైడిపర్తి రత్నాజీ తదితరులు పాల్గొన్నారు.

మోసం.. బాబు నైజం

ఆలమూరు: సాధ్యం కాని హామీలను ఇచ్చి ప్రజలను మోసగించడం సీఎం చంద్రబాబు నైజమని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి అన్నారు. మండలంలోని చింతలూరు, సూర్యారావుపేట గ్రామాల్లో నియోజకవర్గ బూత్ కమిటీ మేనేజర్ నామాల శ్రీనివాసు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. అన్నదాత సుఖీభవ కొందరికే అందించారని, కౌలు రైతులను విస్మరించాలని ఆరోపించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కులమతాలు, పార్టీలకతీతంగా మేలు చేస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులోకి పక్షపాత వైఖరిని అవలంబిస్తుందన్నారు. మండలంలోని చింతలూరు, సూర్యారావుపేట గ్రామాల్లో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. చింతలూరు గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మార్గాని యేసు, సూర్యారావుపేట గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కడలి ఉపేంద్ర నియమితులయ్యారు. వైఎస్సార్ సీపీ పార్టీ పదవుల్లో అత్యధిక శాతం ఎస్సీలు, బీసీలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని మండల కన్వీనర్ తమ్మన తెలియజేశారు. వైఎస్సార్ సీపీ నేతలు యనమదల నాగేశ్వరరావు, నూకపెయ్యి సూరిబాబు, గుణ్ణం రాంబాబు, నాంద్ర నాగమోహన్‌రెడ్డి, కురుపూడి లోవ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఈవీఎం ప్రభుత్వం

కొత్తపేట: రాష్ట్రాన్ని పరిపాలిస్తుంది ప్రజాస్వామ్య ప్రభుత్వం కాదని, ఈవీఎం ప్రభుత్వం.. ఈవీఎం పాలకులని జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు విమర్శించారు. గ్రామాల్లో ×బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ× కార్యక్రమాల్లో భాగంగా ఖండ్రిగ, అవిడి గ్రామాల్లో కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు పర్యవేక్షణలో ఆయా గ్రామ శాఖల అధ్యక్షులు బొక్కా సత్యనారాయణ, యడ్ల నరేష్ అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో డేవిడ్‌రాజు, గంగాధరరావు, గూడపాటి రమాదేవి తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. వారు మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరపున వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి జనరంజక పాలన సాగించగా ప్రజలు పూర్తి విశ్వాసంతో ఓట్లు వేయగా ఫలితం తారుమారైందన్నారు. దీంతో ప్రజలంతా ఈ కూటమి ప్రభుత్వాన్ని ఈవీఎం ప్రభుత్వంగా, ఈవీఎం సీఎంగా, ఈవీఎం ఎమ్మెల్యేలుగా భావిస్తున్నారని అన్నారు. ఎన్నికల ముందు సంపద సృష్టించి సంక్షేమం అమలు చేస్తామని చెప్పి, ఇప్పుడు పీ-4 విధానాన్ని అమలు చేస్తామంటూ చేతులెత్తేశారని విమర్శించారు, అనంతరం క్యూ ఆర్ కోడ్‌లను ఆవిష్కరించి, ఇంటింటికీ వెళ్లి సీఎం చంద్రబాబు మోసాలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు ముసునూరి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు రెడ్డి చంటి, దూనబోయిన నవదీప, ఎంపీటీసీ సభ్యులు పితాని లక్ష్మీతులసి, దంగేటి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అణచివేయాలని చూస్తే తగిన బుద్ధి చెబుతాం

మలికిపురం: రాజకీయపరంగా ఎస్సీలను అణిచి వేయాలని చూస్తే తగిన బుద్ధి చెబుతామని రాజోలు నియోజకవర్గ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం హెచ్చరించింది. ఈ మేరకు మలికిపురంలో మంగళవారం ఎస్సీ సంక్షేమ సంఘ అత్యవసర సమావేశం సంఘ ప్రధాన కార్యదర్శి చింతా రాజబాబు అధ్యక్షతన జరిగింది. రాజబాబు మాట్లాడుతూ రాజోలు ఎంపీపీ స్థానం ఖాళీ అయిన నేపథ్యంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన అధికార పార్టీ వైస్ ఎంపీపీ పాలమూరి శ్యాంబాబుకు కొత్త ఎంపీపీ ఎన్నిక జరిగే వరకూ ఇన్‌చార్జ్ ఎంపీపీగా అవకాశం కల్పించకపోవడం కులవివక్షతకు నిదర్శనమన్నారు. ఎస్సీ రిజర్వ్ నియోజకవర్గంలో ఎస్సీ రాజకీయ నాయకులకు రాజకీయపరంగా కుల వివక్షత ఎదురవుతుండటం యావత్ దళిత సమాజానికి పెనుముప్పు అని ఆవేదన వ్యక్తం చేశారు. రిజర్వేషన్ ప్రకారం కొత్త ఎంపీపీని ఎన్నుకునే ప్రక్రియకు దళిత నేతలు వ్యతిరేకం కాదని, కొత్త ఎంపీపీ ఎన్నుకునే పక్రియ పూర్తయ్యే వరకూ ఉన్న కాలానికి ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వైస్ ఎంపీపీకి ఇన్‌చార్జ్ ఎంపీపీ ఇవ్వకపోవడాన్ని ప్రశ్నిస్తున్నట్లు నాయకులు తెలిపారు. ఈ విషయంపై నియోజకవర్గ వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఎస్సీ సంక్షేమ సంఘ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మలికిపురం మండల ఎస్సీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు గెద్దం ఫిలిప్‌రాజు, సఖినేటిపల్లి మండల అధ్యక్షులు తోటే ప్రతాప్, ప్రధాన కార్యదర్శి నల్లి శివకుమార్, వెంకట్, పెదపాటి అనిల్, రాపాక నవీన్, స్టీవెన్ పాల్, మోకా అవినాష్ పాల్గొన్నారు.

అవగాహనతోనే నులిపురుగుల నిర్మూలన

ఆలమూరు/మామిడికుదురు/అయినవిల్లి: నులిపురుగుల నిర్మూలనకు అవగాహనతో పాటు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ ఎ.రాజు, ఎంఈఓ బి.అప్పాజీ, చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎన్.లక్ష్మీస్నేహలత, డి.సాయికిషోర్ అన్నారు. చొప్పెల్ల పీహెచ్‌సీ పరిధిలో 7007 మందికి గాను 6713 మంది, పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలో 5462 మందికి గాను 5174 మందికి ఈ ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. నులి పురుగుల నిర్మూలనతోనే మెరుగైన ఆరోగ్యం సాధ్యమవుతుందని నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి జాన్ లెవీ సూచించారు. డీ వార్మింగ్ డే కార్యక్రమంలో భాగంగా నగరం జెడ్పీహెచ్ స్కూల్లో మంగళవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. కడుపులో నులి పురుగులు ఉన్న పిల్లలు, కిశోర బాలలు పోషకాహార లోపం, రక్తహీనతతో నీరసంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జాలెం రమణకుమారి, సీహెచ్ఓ కెవిస్ సత్యవతి, హెల్త్ సూపర్‌వైజర్ బళ్ల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. అయినవిల్లి మండలంలోని వీరవల్లిపాలెం, అయినవిల్లి పీహెచ్‌సీల పరిధిలో ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ముక్తేశ్వరం ఎస్ఎన్‌వీఆర్ డిగ్రీ కళాశాల, ముక్తేశ్వరం కోనసీమ విద్యాశ్రమ్ పాఠశాలలోను ఆల్బెండజోల్ మాత్రలను విద్యార్థులకు పంపిణీ చేశారు.

పుస్తక పఠనంతో ఉన్నత శిఖరాలకు..


కొత్తపేటలో కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజు

కొత్తపేట: పుస్తక పఠనం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు అన్నారు. మంగళవారం గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ జయంతిని పురస్కరించుకుని డిగ్రీ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైబ్రరీ సైన్స్ ఆధ్వర్యంలో గ్రంథాలయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కళాశాల లైబ్రరీలో వివిధ పుస్తకాలు, విలువైన గ్రంథాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, లైబ్రరీ ఇన్‌చార్జ్ సీహెచ్ఎస్ నాగరాణి, లైబ్రేరియన్ జానిక్యరామ్ తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

రాజోలులో..

రాజోలు: ఆధునిక గ్రంథాలయ పితామహుడిగా డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ కీర్తి గడించారని రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిబాబు అన్నారు. మంగళవారం కళాశాలలో రంగనాథన్ జయంతి నిర్వహించారు. రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాల ద్వారా విద్యార్థులు ఎంతో విజ్ఞానాన్ని పొందవచ్చని ప్రిన్సిపాల్ సాయిబాబు అన్నారు. గ్రంథాలయాల అభివృద్ధికి, పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించే అనేక కార్యక్రమాలను నిర్వహించారన్నారు. అంతేకాకుండా ఆధునిక యుగంలో గ్రంథాలయాలకు ఒక కొత్త ఒరవడి సృష్టించారన్నారు. ఈ-బుక్స్, ఈ-జర్నల్స్‌తో పాటు అనేక పుస్తకాలను డేటాబేస్‌లో నిక్షిప్తం చేశారన్నారు. కళాశాల గ్రంథాలయ ఇన్‌చార్జి నారాయణరావు, గ్రంథాలయ అధికారి జగదీష్, నల్లి రాజు, చంద్రబోస్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ డ్రైన్‌ను శుభ్రం చేయండి


ప్రభుత్వ పథకాలపై సమీక్షిస్తున్న డీఎల్‌డీఓ వేణుగోపాల్

మామిడికుదురు: స్థానిక బాలుర వసతి గృహాన్ని డీఎల్‌డీఓ వేణుగోపాల్ మంగళవారం తనిఖీ చేశారు. హాస్టల్ నుంచి మురుగు నీరు పారుదల కాకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని గమనించారు. దీనిపై వెంటనే స్పందించారు. మురుగు నీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు మురుగునీరు డ్రైన్ ద్వారా పారుదల అయ్యే విధంగా చూడాలన్నారు. మాకనపాలెం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ పరిస్థితులపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో పలు ప్రభుత్వ కార్యక్రమాలపై కార్యదర్శులతో సమీక్షించారు. బంగారు కుటుంబాలు, వర్క్ ఫ్రమ్ హోమ్, ఇళ్ల పట్టాల వసూలు తదితర అంశాలపై చర్చించారు. ఆయా కార్యక్రమాల్లో ఇంచార్జ్ ఎంపీడీఓ అడబాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచండి

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని అమలాపురం డీఎల్‌పీఓ బొజ్జిరాజు సూచించారు. ఆయన మంగళవారం మామిడికుదురు, మాకనపాలెం గ్రామాల్లో పర్యటించారు. ఆ రెండు గ్రామాల్లో నిర్వహిస్తున్న పారిశుధ్య పనుల్ని పరిశీలించారు. వీధుల్లో ఎక్కడా చెత్త కనిపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సంపూర్ణ పారిశుధ్యమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. చెత్తను సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. ప్రతి పంచాయతీలోనూ పారిశుధ్య కార్యక్రమం పక్కాగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఆయా పంచాయతీల సిబ్బంది ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు లోకిక సంగీత కీర్తి


రాష్ట్ర, జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైన పుల్లేటికుర్రు విద్యార్థులు

అంబాజీపేట: రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాల్ బాడ్మింటన్ పోటీలకు పుల్లేటికుర్రు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని రొళ్ల లోకిక సంగీ కీర్తి, జోనల్ స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం అక్కల వెంకట్రావు తెలిపారు. స్థానిక హైస్కూల్‌లో క్రీడాకారులను మంగళవారం అభినందించారు. హెచ్ఎం మాట్లాడుతూ ఈ నెల 11న జరిగిన జిల్లా స్థాయి అండర్ 22 విభాగంలో పాల్గొని ప్రతిభ కనబరిచారన్నారు. ఈ నెల 29న ప్రకాశం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో లోకిక సంగీతకీర్తి పాల్గొనుందన్నారు. ఐదు జిల్లాలకు సంబంధించి జోనల్ స్థాయి పోటీలకు డాక్టర్ బీఆర్అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి ఖోఖో బాలుర విభాగంలో మద్రి తేజశ్వ, యల్లా కార్తికేయ, బాలికల విభాగంలో చిట్టూరి వైష్ణవి, మోర్త లాస్య, మామిడిశెట్టి తేజ శ్రీదుర్గాశ్రీ, 400 మీటర్ల రన్నింగ్‌లో చీకురుమిల్లి హర్షవర్ధన్ ఎంపికయ్యారన్నారు. పీడీలు అందె సూర్యనారాయణ, దొమ్మేటి ఉదయ భాస్కర్‌లను, విద్యార్థులను సర్పంచ్ జల్లి బాలరాజు, ఎస్ఎంసీ చైర్మన్, ఎంపీటీసీ సభ్యులు అభినందించారు.